క్లుప్తంగా

తలతంపరలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ జగబంధు దొళాయి

కంచిలి: మండలంలోని తలతంపర పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. పనులను సర్పంచ్ డాక్టర్ జగబంధు దొళాయి పర్యవేక్షించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులకు దూరంగా ఉంటామన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయవద్దని గ్రామస్తులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీ రుణాలపై అవగాహన



వీవోఏలతో మాట్లాడుతున్న ప్రసాదరావు

ఇచ్ఛాపురం రూరల్: బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు వీవోఏలు సభ్యులకు అవగాహన కల్పించాలని సెర్ప్ ఏపీఎం సనపల ప్రసాదరావు అన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో శ్రీనిధి, ఉన్నతి, గ్రామ సంఘాల నుంచి ఇచ్చే సామాజిక పెట్టుబడిపై చర్చించారు. సభ్యులు రుణం తీసుకోబేయే ముందు సంఘంలో వారి పాత్ర, రుణాలు వాయిదా చెల్లింపులను పరిశీలించాలని అన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ధనుంజయ తదితరులు

కంచిలి: ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను సద్వినియోగపర్చుకోవాలని డ్వామా ఏపీవో బి.ధనుంజయ కోరారు. పెద్ద కొజ్జిరియా పంచాయతీ పరిధిలో చేపడుతున్న ఉపాధి పనులను మంగళవారం పరిశీలించారు. అదేవిధంగా ఉపాధిహామీ, హార్టీకల్చర్ పథకాల ద్వారా నాటిన జీడి మొక్కలను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో సాంకేతిక, క్షేత్ర సహాయకులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రత్యేకశ్రద్ధ



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మ

కవిటి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పెరుగుతున్న సీజనల్‌వ్యాధులపై వైద్యశాఖ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధవహించి ప్రజలకు మెరుగైన సేవలందించాలని కవిటి ఎంపీపీ కడియాల పద్మ అన్నారు. రాజపురం పీహెచ్‌సీ అభివృద్ధికమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించిన అనంతరం రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. ప్రధానంగా ఆస్పత్రిలో పెండింగ్ వైపై బిల్లుల చెల్లింపులు పూర్తిచేయాలని, ఆస్పత్రి మెయింటినెన్స్ చేస్తున్న స్వీపర్ల జీతాల చెల్లించేందుకు తీర్మానం చేశారు. సమావేశంలో మెడికల్‌ఆఫీసర్లు డాక్టర్ కె.శశిధర్, కె.మౌనిక, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, సనపల కృష్ణారావు, ఎన్ని అశోక్ ఉన్నారు.

నిత్యావసర ధరలు తగ్గించాలి



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

సోంపేట: పెరిగిన నిత్యావసర ధరలు వెంటనే తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ జాతీయ సేవాసమితి పిలుపులో భాగంగా పెరిగిన నిత్యావసర ధరలను తగ్గించాలనే డిమాండ్‌లో భాగంగా ఈ నెల ఒకటి నుంచి ఆరో తేదీ వరకు చేపడుతున్న నిరసనల్లో భాగంగా సోంపేటలో వాల్‌పోస్టర్లను మంగళవారం విడుదల చేశారు. జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ మాట్లాడుతూ.. రోజురోజుకూ పెరుగుతున్న ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యావన్నారు. కూరగాయల ధరలు కూడా ఆకాశన్నంటుతున్నాయని విమర్శించారు. ధరల నియంత్రణ లేక పోవడంతో పేద, సామన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు సాలీన నారాయణ స్వామి, పుక్కల అరెలమ్మ, అయినింటి లోకనాథం, సోమేష్ ఉన్నారు.

• పంపిణీకి సిద్ధంగా..



పర్యావరణానికి ఎటువంటి హాని కలిగించని మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని కంచిలి పట్టణ కళింగ కోమటి సంఘ అధ్యక్షుడు ఇప్పిలి ప్రవీణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సంఘం తరఫున వినాయక చవితి సందర్భంగా ఉచితంగా పంపిణీ చేయడానికి రెండు వేల మట్టి వినాయక ప్రతిమలను సిద్ధం చేసినట్లు సంఘ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. ఈ నెల ఆరో తేదీన ఇంటింటికీ సంఘ ప్రతినిధులు వచ్చి పంపిణీ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో కె.నాగరాజు, వి.నళినీకాంత్, వి.రవి, జి.పైడిరాజు పాల్గొన్నారు.

–కంచిలి

• బస్టాండ్‌ను ఆక్రమించేస్తున్నాయ్..



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అత్యంత రద్దీగా ఉన్నటువంటి కాశీబుగ్గ రాజీవ్‌గాంధీ బస్టాండ్ నుంచి రోజూ సుమారు పదివేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. అటువంటి బస్టాండ్‌లో రాత్రి ఎడున్నర గంటలు అయితే మనుషులకు చోటు లేకుండా పశువులు ఆక్రమించేస్తున్నాయి. ఉదయానికి కాంప్లెక్స్ ఆవరణను పేడతో పాడు చేస్తున్నాయి. దీంతో ప్రయాణికులు దుర్గంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు జారిపడిపోయిన సంఘటనలు ఉన్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి పశువులు బస్టాండ్ ఆవరణలోకి రాకుండా కంచెకట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

–కాశీబుగ్గ

• బడి రుణం తీర్చుకుందాం



చదువుకున్న బడి రుణం తీసుకోవడానికి పూర్వ విద్యార్థులు వస్తు, ధన రూపేణ సహకరించాలని కొళిగాం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నరేంద్రనాథ్ పట్నాయక్ పిలుపునిచ్చారు. పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి, అదే పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ మహంతి సుమారు రూ.40 వేలు విలువైన అహుజా మైక్‌సెట్‌ను పాఠశాలకు వితరణ చేశారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మైక్‌సెట్‌ను ఉపాధ్యాయులకు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

పంటలను కాపాడుకోండిలా..

- వర్షాలతో ఆందోళనలో రైతులు
- అప్రమత్తత చర్యలు పాటిస్తే భయం లేదంటున్న అధికారులు



కోటబొమ్మాళి సమీపంలో ఉద్యానవన పంటలు పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారి సునీత

టెక్కలి:

వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో వరి, ఉద్యానవన పంటలు పండిస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. టెక్కలి నియోజకవర్గంలో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి తదితర మండలాల్లో సుమారు 71 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి దుబ్బు కట్టి పిలకల దశకు చేరుకుంటోంది. అలాగే సుమారు 95 ఎకరాల్లో ఉద్యానవన పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వ్యవసాయంపై ఎటువంటి నష్టపరిచే చర్యలు లేకపోయినప్పటికీ, వర్షం అధికమైతే తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అధికారులు అప్రమత్తత చేస్తున్నారు. అలాగే ఉద్యానవన పంటలను కాపాడుకునే విషయంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

నీటిని తోడేయ్యాలి



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కూరగాయల సాగు చేస్తున్న రైతులు జాగ్రత్త చర్యలు పాటించాలి. ఉద్యానవన పంటలు సాగు చేస్తున్న మడుల్లోకి చేరిన నీటిని కాలువ విధానంతో బయటకు తోడేయ్యాలి. టెక్కలి నియోజకవర్గంలో ప్రస్తుతం బెండ, వంకాయ, చిక్కుడు, బీర, కాకర, ఆనప, మిరప, గోంగూర, తోటకూర పంటలు సాగు చేస్తున్నారు. అధికంగా చేరిన వర్షపు నీటి వలన కుళ్లు, వేరు తెగులు కాండం తెగులు వచ్చే ప్రమాదం ఉంది. ముందు జాగ్రత్త చర్యగా లీటరు నీటికి 2.5 గ్రాముల సాఫ్ మందును రెండు సార్లు పిచికారి చేయాలి. వేరు కుళ్లు ఆశించకుండా 30 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ లేదా కర్బండిజమ్ 10 గ్రాముల చొప్పున 10 లీటర్ల నీటిలో కలిపి మొక్కల పాదల్లో వేయాలి. ఎక్కడైనా మొక్కలు పడిపోతే జాగ్రత్తగా నిలబెట్టి మొదల దగ్గరగా మట్టిని ఎగదోయాలి. మొక్కలకు సరిపోయినంత ఆకులు, కొమ్మలు ఉంటే నీటిలో కరిగే ఎరువు మల్టి–కే తగిన మోతాదులో వేసుకుని రెండు శాతం యూరియా ద్రావణాన్ని రెండు నుంచి మూడుసార్లు మొక్క తడిచేటట్లు వారం రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

–సునీత, ఉద్యానవన శాఖాధికారి, టెక్కలి.

ఎటువంటి ఆందోళన వద్దు



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరి సాగు చేస్తున్న రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పిలకల దశలో వరి ఐదు రోజుల వరకు నీట మునిగినా బతికే అవకాశం ఉంది. ముంపును తట్టుకునే ఎంటీయూ 1140, 1172, 1223, 1064 పీఎల్ ఏ 1100 తదితర రకాలు వారం రోజుల పాటు ముంపును తట్టుకుంటాయి. ఎంటీయూ 1232 రకం 10 నుంచి 12 రోజుల వరకు తాత్కాళిక ముంపును తట్టుకుంటాయి. పిలకల దశలో వరి పంట నీట మునిగితే నీరు బయటకు వెళ్లిన తరువాత ఎకరానికి 20 కిలోలు చొప్పున యూరియా, పొటాష్ వేసుకోవాలి. వీటితో పాటు ఎండాకు తెగులు, మాగుడు తెగులు, ఆకుముడత తెగులు వచ్చే అవకాశాలు ఉంటాయి. అవి రాకుండా చేనులో వచ్చే మార్పులను గమనిస్తూ వ్యవసాయాధికారులను సంప్రదించాలి.

–బి.వి.తిరుమలరావు, వ్యవసాయ శాఖ ఏడీ, టెక్కలి.

గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరమణ

సోంపేట: గ్రామ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో బెందాళం వెంకటరమణ అన్నారు. ఎం.జీపురం పంచాయతీ పరిధి ఎస్.ఆర్.నగర్‌లో ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ గ్రామసభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఇంటికి మంచినీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, రహదారుల నిర్మాణం, నాణ్యమైన విద్య తదితర సమస్యలపై ఈ సందర్భంగా చర్చించారు. ప్రభుత్వ గిరిజన బాలుర గురుకుల పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పంచాయతీరాజ్ జేఈ రమేష్, పంచాయతీ కార్యదర్శి ఎస్.ప్రసాదరావు, గ్రామరెవెన్యూ అధికారి జోగేశ్వరరావు ఉన్నారు.

పేదలకు అన్నదానం



భోజనాన్ని అందిస్తున్న ప్రతినిధులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ కోనేరు (నెహ్రూ పార్క్)ఆవరణలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పేదలకు మంగళవారం అన్నదానం చేశారు. పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తమ్మినేని పాపినాయుడు సహకారంతో 80 మందికి భోజనాన్ని అందించారు. కౌన్సిలర్ వజ్జ బాబూరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు హెచ్.వై.దొర, ప్రధాన కార్యదర్శి తమ్మినేని మాధవరావు, కోశాధికారి నెమలిపురి అప్పారావు, ప్రతినిధులు రోణంకి హేమాచలం, డాక్టర్ కుమార్ నాయక్, కేపీ రామన్న, తమ్మినాని కిషన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన తరగతులు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

కాశీబుగ్గ: విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి అన్నారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు దీక్ష ఆరంభ్ ఇండెక్సన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సెమిస్టర్ విధానం, తరగతుల బోధనపై అవగాహన కల్పించారు. కళాశాలలో చదువు కోవడానికి ఉన్న మౌలిక సదుపాయలను వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మధు, లైబ్రేరియన్ నర్సింహులు, హేమచలం, ప్రసాద్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం



నాగేంద్రకుమార్‌ను సత్కరిస్తున్న చైర్మన్ గిరిబాబు, ఉద్యోగులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్‌గా పని చేసి కొవ్వూరు మున్సిపాలిటీకి బదిలీపై వెళ్తున్న టి.నాగేంద్రకుమార్‌ను మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మాట్లాడుతూ.. 2013–14లో 17 నెలలు, 2019–20 సంవత్సరంలో తొమ్మిది నెలలు, 2022–24 సంవత్సరంలో 18 నెలలు పనిచేసి అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో డీఈ జి.కనకరాజు, ఏఈ బి.అవినాష్, రెవెన్యూ ఆఫీసర్ అప్పలస్వామి, టీపీఈవో అప్పలరాజు, ఆర్ఐ అమరేశ్వరరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శివలక్ష్మి, డీఈఈ డిల్లీశ్వర బెహరా, బద్రి సోమేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



మాట్లాడుతున్న సీడీపీవో నాగరాణి

ఇచ్ఛాపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించాలని సీడీపీవో నాగరాణి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని 6, 12, 14, వార్డుల్లో గల బోరవీధి, చాకలిపేట, హడ్డివీధి, పొందరవీధి, మహంతివీధి అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ.. ఈ నెల ఒకటి నుంచి 30వ తేదీవరకు పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించి ప్రాధాన్యతను బాలింతలు, గర్భిణులు, పిల్లలకు వివరించాలని సూచించారు. సూపర్‌వైజర్ బి.సుజాత, మహిళా కార్యదర్శులు ఉషారాణి, రాజేశ్వరి ఉన్నారు.

ఉద్ధృతంగా బెండిగెడ్డ ప్రవాహం



ఉద్ధృతంగా ప్రవహిస్తున్న బెండిగెడ్డ

వజ్రపుకొత్తూరు రూరల్: వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో స్థానిక బెండిగెడ్డ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో వర్షాలు కురవడంతో వరద నీరు బెండి గెడ్డలోకి భారీగా చేరింది. దీంతో పాటు పలాస, వజ్రపుకొత్తూరు, మెళియపుట్టి మండలాల్లో కురిసిన వర్షం నీరు కూడా ఈ గెడ్డలోనే చేరడంతో వరదనీరు మరింత ఉద్ధృతంగా ప్రవహిస్తూ ఉప్పుటేరు మీదగా నువ్వలరేవు వద్ద బంగాళఖాతంలో కలుస్తుంది.

రూ. 2 లక్షలు వితరణ చేసిన పూర్వ విద్యార్థులు

కాశీబుగ్గ: మందస మండల కేంద్రంలో శ్రీరాజాశ్రీనివాస మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. పాఠశాల బిల్డింగ్ శిథిలావస్థకు చేరుకోవడంతో దాని పునర్నిర్మాణం కోసం పూర్వ విద్యార్థుల సంఘం నడుబిగించింది. 1990–91 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పలువురు పూర్వ విద్యార్థులు రూ.2.05 లక్షల చెక్కును సంఘ సభ్యులకు అందజేశారు.

ఆశ కార్యకర్తల ఆందోళన



వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఆశ కార్యకర్తలు

వజ్రపుకొత్తూరు రూరల్: ఎన్నికల సమయంలో ఆశ కార్యకర్తలకు కూటమీ నాయకులు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, మండల నాయకులు నెయ్యిల మోహన్‌రావులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అక్కుపల్లి, వజ్రపుకొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆశ కార్యకర్తలతో కలిసి మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వేతనాల పెంపునకు, గ్రాడ్యూటీ, వయోపరిమితి పెంపు, పింఛన్లను అందిస్తామని హామీ ఇచ్చిందని..అయితే ఎన్నికల సమయంలో జీవోను విడుదల చేయలేదన్నారు. అయితే కూటమి నాయకులు కూడా అదే సమయంలో ఇవే హామీలను ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను విస్మరించారని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేసి ఆశ కార్యకర్తలకు న్యాయం చేయాలన్నారు. అనంతరం పీహెచ్ వైద్యాధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రమణమ్మ, మోహిని, భారతి, జి.క్రిష్టవేణి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కవిటి: మండలంలోని వడ్డిజల్లుపుట్టుగ జంక్షన్‌లో ఏబీస్విచ్ ఎరక్షన్ పనులను బుధవారం చేపట్టనున్నారు. దీంతో ఆర్‌భైరిపురం ఫీడర్‌లోని డిగొనవపుట్టుగ, నెలవంక పంచాయతీల పరిధిలోని గ్రామాలకు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాను విద్యుత్ సరఫరా నిలుపుదలచేస్తున్నట్టు కవిటి ట్రాన్స్‌కో అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బడిబయట పిల్లలపై సర్వే

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలో మంగళవారం విద్యా శాఖా సిబ్బంది బడి బయట పిల్లలపై సర్వే నిర్వహించారు. విద్యా శాఖాధికారులు డి.తులసీరెడ్డి, డి.చిన్నారావు ఆదేశాల మేరకు సీఆర్‌ఎంటీ సిబ్బంది లోకేశ్వరి, ఎర్రన్న, రాజు, మల్లేశ్వరరావు తదితరులు స్థానిక కంద్ర వీధిలో సర్వే చేశారు. ఈ సందర్భంగా బడి బయట పిల్లల వివరాలను సేకరించారు.

ఫొటో:03టెక్కలి02: సర్వే చేస్తున్న సిబ్బంది

మురుగునీరు తొలగించండి

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి ఎన్‌టీఆర్ కాలనీ ఆరో లైన్లో కాలువల్లో నిలిచిపోయిన మురుగు నీటిని మళ్లించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు పంచాయతీ అధికారులకు విన్నవించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరుతున్న వరద మురుగు నీటితో కలిసిపోయి నిలిచిపోయినట్టు చెప్పారు. అంతే కాకుండా వీధి మధ్యలో చెత్త నిల్వలు లేకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

విద్యార్థులకు పుస్తకాలు వితరణ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: దంత ప్రాథమిక పాఠశాలలో మంగళవారం 70 మంది విద్యార్థులకు స్థానిక యువకులు పుస్తకాలు, పెన్నులను వితరణ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో యువకులు లండ పవన్, లావేటి అప్పలరాజు, రామారావు, హెచ్‌ఎం గొండు నారాయణరావు ఉన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రస్తుతం సీజన్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో పెద్దబొడ్డపాడు పంచాయతీ పరిధిలోని సీతాపురం, పెద్దబొడ్డపాడు, ఎస్సీ కాలనీలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. శ్మశానవాటికలు, కూడళ్లు, రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన పిచ్చిమొక్కలను, చెత్త చెదారాన్ని యంత్రాల సాయంతో తొలిగించారు. స్థానిక సర్పంచ్ తమ్మినాన ఢిల్లీరావు, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సతీష్ పనులను మంగళవారం పరిశీలించారు.

విద్యార్థులకు టీ షర్టులు పంపిణీ



విద్యార్థులకు టీ షర్టులు అందజేస్తున్న దృశ్యం

కంచిలి: మండలంలోని ఎక్కల పంచాయతీ పరిధి అర్జునాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన అభిమానులు టీ షర్టులను పంపిణీ చేశారు. 22 మందికి వీటిని మంగళవారం అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం బాబూరావు, ఉపాధ్యాయులు సంధ్య, కామేష్‌రెడ్డి, యువత రవి, రుషి, మోహన్, క్రిష్ణ, మహేష్, మనోజ్, పూర్ణ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అప్పలనాయుడు

కోటబొమ్మాళి: విద్యార్థినులకు చదువుతోపాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోటబొమ్మాళి న్యాయవిజ్ఞాన సేవాసంఘం కార్యదర్శి వెలమల అప్పలనాయుడు అన్నారు. స్థానిక బాలికల ఉన్నతపాఠశాలలో చట్టాలపై బాలకలకు మంగళవారం అవగాహన కల్పించారు. రాజ్యాంగపరంగా మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటి గురించి తెలుసుకోవలసిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ రమాదేవి, డ్రాయింగ్ టీచర్ కూన భాస్కరరావు ఉన్నారు.

లోక్ అదాలత్‌పై కసరత్తు



లోక్ అదాలత్‌పై చర్చిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: ఈ నెల 14వ తేదీన జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో అధిక కేసులు పరిష్కారమయ్యేలా న్యాయవాదులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా పలాస జూనియర్ సివిల్ కోర్టులో సన్నాహక సమావేశం మంగళవారం జరిగింది. జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత 14న జరగనున్న లోక్‌అదాలత్‌కు సంబంధించి కేసుల పరిష్కారం కోసం న్యాయవాదులు, కక్షిదారులతో చర్చలు జరిపించారు. క్రిమినల్, మనోవర్తి కేసులపై చర్చలు జరిపి రెండు కేసులను ముందుగానే పరిష్కారం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కోత నిరంజన్, జి.ప్రభాకర్, సయ్యద్ మహమ్మద్, బీఆర్‌కే పట్నాయక్, సుధారాణి, ఉష, సీసీ నారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక మండపాలు పరిశీలన

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలో వినాయక ఉత్సవాల అనుమతి కోసం సింగిల్ విండో విధానం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న మండపాలను వివిధ విభాగాల అధికారులు మంగళవారం పరిశీలించారు. బెల్లుపడలో ఏర్పాటు చేసిన మండపాన్ని పట్టణ పోలీసులు, ఫైర్, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్‌శాఖా అధికారులు పరిశీలించారు. ఉత్సవాల నిర్వాహకులకు పలు సూచనలు అందజేశారు. పట్టణ ఎస్సై ఇ.చిన్నంనాయుడు ఇతర అధికారుల ఉన్నారు.